అవాంతరాలు.. అధిగమించి..

- రాడార్ కేంద్రం ఏర్పాటుకు సిద్ధం.
- పర్యావరణ, సామాజిక వేత్తల సందేహాలు నివృత్తి చేయాల్సిన ఆవశ్యకత


దామగుండం అటవీ ప్రాంతం

న్యూస్‌టుడే, పరిగి, పూడూరు: పరిగి నియోజకవర్గం పూడూరు మండలం దామగుండం రిజర్వు ఫారెస్టులో భారత నౌకాదళానికి సంబంధించిన నేవీ రాడార్ కేంద్రం (వ్యూహాత్మక కమ్యూనికేషన్ స్టేషన్) ఏర్పాటుకు నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుడుతున్నాయి. నిజానికి పదేళ్ల క్రితమే ఇక్కడ వీఎల్ఎఫ్ స్టేషన్‌కు భారత నౌకాదళం, రక్షణ శాఖ ద్వారా ప్రయత్నాలు ప్రారంభించింది. కేంద్ర పర్యావరణశాఖ నుంచి స్టేజ్ -2 అనుమతులు కూడా లభించాయి. పలు కారణాలతో వాయిదా డగా స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పట్టుబట్టడం, సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోవడంతో ఖాయమైంది. అయితే కొంత కాలంగా దీనిపై పర్యావరణ ప్రేమికులు, సామాజిక వేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. నేవీ అధికారులు ఈ కోణంలో కూడా ఆలోచించి పర్యావరణానికి ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం

పూడూరు నుంచే పర్యవేక్షణ: అరేబియా సముద్రం, హిందూ మహాసముద్రం, బంగాళాఖాతంలో తిరిగే నౌకలు, జలాంతర్గాముల నుంచి వచ్చే సంకేతాల్ని పూడూరు నుంచే పర్యవేక్షించడానికి కమ్యూనికేషన్ వ్యవస్థ ఏర్పాటవుతోంది. దీని కోసమే వీఎల్ఎఫ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు.


శంకుస్థాపన ఏర్పాట్లలో నేవీ అధికారులు

దేశ చరిత్రలో పరిగికి ప్రత్యేక స్థానం

– టి.రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే



దేశ రక్షణ వ్యవస్థ పరిగిలో ఏర్పాటు కావడం హర్షించదగ్గ విషయం. చరిత్రలోనే పరిగి పేరు నిలిచిపోతుంది. పర్యావరణానికి ఎలాంటి నష్టం జరగదు. స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

ఎలాంటి హానీ ఉండదు

– జ్ఞానేశ్వర్, జిల్లా అటవీ అధికారి



రాడార్ కేంద్రం ఏర్పాటుతో పర్యావరణానికి ఎలాంటి హాని ఉండదు. నేవీకి అప్పగించిన భూమిలో 1.93లక్షల మొక్కలే ఉన్నాయి. అవసరాన్ని బట్టి మాత్రమే తొలగిస్తారు. జీవ వైవిధ్యం, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు తగిన చర్యలు చేపడతారు.

ఆది నుంచీ వ్యతిరేకత

● రాడార్ స్టేషన్ ఏర్పాటుతో రేడియేషన్ ప్రభావంతో ఈ ప్రాంతంలో పర్యావరణం దెబ్బతింటుందని పలువురు పర్యావరణ వేత్తలు, సామాజిక ఉద్యమకారులు ఆది నుంచి వ్యతిరేకిస్తున్నారు. నిరసనలు కూడా చేశారు. మరి కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ● అనుమతులు రద్దు చేయాలని భూములను అప్పగించరాదని కోరుతూ గతంలో పూడూరు గ్రామసభలో తీర్మానించి కలెక్టర్‌కు అందించారు. ● ఇక్కడ పురాతన రామలింగేశ్వర స్వామి ఆలయం ఉంది. ప్రాజెక్టు ఏర్పాటుతో ఆలయ మనుగడపై భక్తుల్లో పలు సందేహాలు నెలకొన్నాయి.

ఆ నివేదికలు బయట పెట్టాలి

– ఎం.నాగేశ్వర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, పరిగి



రాడార్ స్టేషన్‌తో లక్షలాది మొక్కలు పోవడంతో పాటు పర్యావరణానికి తీవ్రహాని కలుగుతుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తమిళనాడులో ఏర్పాటు చేసిన సమయంలో ఎలాంటి హానీ లేదన్న నివేదికలను ప్రజల ముందు ఉంచాలి.

మరో చోటుకు మార్చితేనే మంచిది

– సత్యానందస్వామి, దామగుండం పరిరక్షణ కమిటీ సభ్యుడు



వీఎల్ఎఫ్ స్టేషన్‌తో నీరు కలుషితం కావడం, రేడియేషన్ ప్రభావంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదముంది. జీవరాశుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది. చుట్టూ పది గ్రామాల ప్రజలపై ప్రభావం ఉంటుంది.

- దామగుండం రిజర్వు ఫారెస్టు ఏరియా విస్తీర్ణం - 3260 ఎకరాలు
- రాడార్ స్టేషన్‌కు కేటాయించిన భూమి - 2900 ఎకరాలు
- అందులో ఉన్న చెట్లు, మొక్కలు సుమారు - 1,93,562
- ప్రాజెక్టు అంచనా వ్యయం.. రూ.3,100 కోట్లు
- అటవీభూమి అప్పగించేందుకు కంపా నిధులు. రూ.133.54 కోట్లు
- భూ సంరక్షణ చర్యలకు నేవీ చెల్లింపులు.. రూ.18.56కోట్లు

జాతీయ రహదారి.. విస్తరణకు నోచుకునేనా?

నేడు జిల్లాకు సీఎం, మంత్రుల రాకతో ప్రజల్లో ఆశలు

న్యూస్‌టుడే, పూడూరు:

హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారి జిల్లాకు ఎంత ప్రత్యేకంగా నిలుస్తోందో, ప్రమాదాల విషయంలో అంతకంటే ప్రత్యేకంగా నిలుస్తోంది. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారి విస్తరణకు నోచక పోవడంతో ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. రహదారి విస్తరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గతంలోనే ముందుకు వచ్చాయి. కానీ పనులు మాత్రం సాగడంలేదు. నేడు దామగుండం నేవీ ప్రాజెక్టు శంకుస్థాపనకు సీఎం, మంత్రులు వస్తున్న నేపథ్యంలో ఇకనైనా దీనికి మోక్షం లభించాలని ప్రజలు కోరుకుంటున్నారు. దీనికి సంబంధించి 'న్యూస్‌టుడే' కథనం.

విస్తరణ నిర్దేశిత దూరం.. 45 కి.మీ.
ఎక్కడినుంచి ఎక్కడకు..
అప్పా జంక్షన్, చేవెళ్ల, మన్నెగూడ.
అంచనా వ్యయం. రూ.1,000 కోట్లు
మంజూరు.. రూ.750 కోట్లు

- ఈ దారిపై మూడేళ్లలో జరిగిన ప్రమాదాలు.. 367
- మృతులు.. 137
- క్షతగాత్రులు.. 480


ప్రమాదానికి గురైన వాహనాలు

రెండేళ్ల క్రితమే పనులకు అనుమతులు

జాతీయ రహదారి వెళ్లే రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అప్పా జంక్షన్ నుంచి చేవెళ్ల మీదుగా మన్నెగూడ వరకు నాలుగు వరుసలు చేపట్టేందుకు రెండేళ్ల క్రితమే అనుమతులు వచ్చాయి. రహదారికి ఇరువైపులా భూములు, భవనాలు, ఆస్తులు కోల్పోతుండటంతో అంచనాలను రూపొందించిన అధికారులు ప్రభుత్వ పరంగా బాధితులకు పరిహారం అందించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న మహావృక్షాలు నరికి వేయరాదంటూ ఓ స్వచ్ఛంద సంస్థ జాతీయ హరిత ధర్మాసనాన్ని ఆశ్రయించటంతో విస్తరణలో జాప్యం జరుగుతోంది. దీనిపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

నెత్తురోడుతున్న రహదారి:

రెండేళ్ల క్రితం వికారాబాద్ పట్టణానికి చెందిన నలుగురు వ్యక్తులు కారులో హైదరాబాద్ వెళ్తుండగా అంగడి చిట్టంపల్లి గేటు సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చిన క్వాలిస్ వాహనం ఢీకొట్టింది. ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు.

● అదే ఏడాది డిసెంబరు 21న కండ్లపల్లి గేటువద్ద ద్విచక్ర వాహనం, కారు బలంగా ఢీకొన్న ప్రమాదంలో ఓ సిమెంటు కార్మికుడు దుర్మరణం చెందాడు.

● నాలుగు నెలల క్రితం ఓ ఉపాధ్యాయుడు ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా కండ్లపల్లి మలుపు వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన సిమెంట్ ట్యాంకర్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడికి బలమైన గాయాలై మృత్యువు పాలయ్యారు.

● ఇటీవల మీర్జాపూర్ గేటువద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరి కాలు విరిగింది.

పనుల ప్రారంభంపై స్పష్టత లేదు

హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు ప్రారంభించటంలో ఇప్పటికీ ఎలాంటి స్పష్టత రాలేదు. రహదారి విస్తరణలో కొన్ని అడ్డంకులు రావటంతో చాలాకాలంగా జాప్యం జరుగుతుంది. త్వరితగతిన చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నాం. – **శరత్, జాతీయ రహదారుల సంస్థ అధికారి.**

డీఎం, ఆర్ఎంలతో 'కడా' అధికారి సమావేశం

ఈనాడు కథనానికి స్పందన

కొడంగల్, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు బస్సుల సౌకర్యం కల్పించాలని ఈ నెల 7 'ప్రగతి చక్రం.. పల్లెలకు దూరం' శీర్షికన 'ఈనాడు'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం 'కడా' ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. తాండూర్, మహబూబ్‌నగర్, పరిగి, నారాయణపేట, కోస్గి డిపోలకు చెందిన బస్సుల సంఖ్య మరింత పెంచాలని ఆయా ఆర్ఎం, డీఎంలకు 'కడా' అధికారి సూచించారు. పరిగి డిపో పరిధిలో పెండింగ్‌లో ఉన్న 'ఎన్కేపల్లి' గ్రామానికి 10 రోజుల్లో బస్సును ప్రారంభిస్తామని పరిగి డిపో మేనేజర్ కరుణ శ్రీ తెలిపారు. కొడంగల్ బస్టాండ్ నుంచి బస్సుల సంఖ్యను దాదాపు 20కి పైగా పెంచేందుకు కృషి చేస్తున్నట్లు 'కడా' అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఆర్టీసీ ఆర్ఎమ్ శ్రీదేవి, పరిగి డీఎం కరుణశ్రీ, తాండూర్ డీఎం సురేష్, నారాయణపేట డీఎం లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం


దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజావాణి కార్యక్రమం ద్వారా స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. 55 అర్జీలను స్వీకరించామని, వీటిలో భూమి, ఇతర సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయన్నారు. వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. పరిష్కరించనివి ఉంటే తగిన సూచనలు, సలహాలను అందజేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏఓ కరీనా ఖాతూన్, సూపరింటెండెంట్ సంధ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ దరఖాస్తులే ఎక్కువ

తాండూరు టౌన్: సమస్యలు పరిష్కరించటానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తాండూరు సబ్ కలెక్టరు ఉమాశంకర్ ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని సబ్ కలెక్టరు కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 9 మంది దరఖాస్తులు రాగా ఎక్కువగా రెవెన్యూ శాఖకు సంబంధించినవే ఉన్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూసమస్యల పరిష్కారానికి చొరవ అవసరమన్నారు.

ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా సాగాలి

తాండూరు టౌన్: ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా జరగాలని తాండూరు సబ్ కలెకర్ ఉమాశంకర్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం వ్యవసాయ, ఉద్యాన, పౌర సరఫరాల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 125 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వాటికి సంబంధించిన పూర్తి వివరాలను ఇవ్వాలని చెప్పారు.

తాండూరుగ్రామీణ: తహసీల్ కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడుపరిష్కరించాలని తాండూరు ఉపపాలనాధికారి ఉమాశంకర్‌ప్రసాద్ అధికారుల్నిఆదేశించారు. తాండూరు తహసీల్ కార్యాలయాన్ని ఉపపాలనాధికారి సోమవారం ఆకస్మికంగా సందర్శించి భూ దస్త్రాలను పరిశీలించి మాట్లాడారు. తహసీల్దారు కేతావత్ తారాసింగ్ ఉన్నారు.



రాడార్ కేంద్రం శంకుస్థాపన పనుల పరిశీలన

వికారాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: పూడూరు మండలం దామగుండం అటవీ ప్రాంతంలో మంగళవారం చేపట్టనున్న రాడార్ స్టేషన్ శంకుస్థాపన పనుల ఏర్పాట్లను సోమవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ కేంద్ర నావికాదళ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాతీయ భద్రత, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ బృందాలు, నావికా దళ అధికారులతో కలెక్టర్, ఎస్పీ సమావేశం నిర్వహించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, శిక్షణ కలెక్టర్ ఉమాహారతి తదితరులు పాల్గొన్నారు.


హెలిప్యాడ్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి

వృక్ష, జంతుజాలానికి తీరని నష్టం

వికారాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: దామగుండంలో రాడార్ స్టేషన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేయటాన్ని ఉపసంహరించుకోవాలని జేఏసీ నాయకులు గీత, ఆనంద్, మల్లేశ్, శ్రీనివాస్, తదితరులు కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ సుధీర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దామగుండం అటవీ ప్రాంతం ఒక ముఖ్యమైన పర్యావరణ జోన్ అని ఇక్కడ విభిన్న వృక్షాలున్నాయని తెలిపారు. దీని ద్వారా వృక్షజాతులకు, జంతుజాలానికి ఎంతో నష్టం వాటిల్లుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌నాయక్, వెంకటయ్య, నర్సింహులు, రాములు తదితరులు పాల్గొన్నారు.

నేడు కొత్త టీచర్లకు కౌన్సెలింగ్

వికారాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024లో ఎంపికై జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో రిపోర్ట్ చేసిన అభ్యర్థులు నేడు (మంగళవారం) స్థానిక జిల్లా పరిషత్తు కార్యాలయంలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని జిల్లా విద్యాధికారిణి రేణుకాదేవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి స్కూల్ అసిస్టెంట్‌లకు, భాషా పండితులకు, పీఈటీలకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు నియామకపు పత్రం, రెండు తాజా పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, అన్ని నిజ ధ్రువ పత్రాలతో హాజరు కావాలని ఆమె సూచించారు.

16న ఓగీపూర్ గనుల్లో కొలతలు

తాండూరు గ్రామీణ, న్యూస్‌టుడే: తాండూరు మండలం ఓగీపూర్‌లోని సర్వే సంఖ్య 64, 65లోని నాపరాయి గనుల్లో గనులు భూగర్భ వనరుల శాఖ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా కొలతలు నిర్వహించనున్నారు. ఈనెల 16న ఉదయం 11గంటలకు పోలీసు బందోబస్తు మధ్య కొలతల ప్రక్రియ నిర్వహించేందుకు రెండు శాఖల అధికారులు ఖరారు చేశారు.

విధుల్లో నిర్లక్ష్యం.. సహించం

వికారాబాద్ గ్రామీణ: పంచాయతీ సిబ్బంది పనుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని మండల ప్రత్యేకాధికారి వినయ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని కొటాలగూడ గ్రామంలో నీటి సమస్య ఉందని గ్రామస్థులు ఆదివారం ఆందోళన చేయడంతో ఆయన సోమవారం గ్రామంలో తిరిగి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. భగీరథ నీటి సరఫరా ఉన్నప్పటికీ, గ్రామంలో సిబ్బంది నిర్లక్ష్యం వల్లనే నీటి సరఫరా జరగలేదని తేలిందన్నారు. చెత్త సేకరణ నిరంతరంగా కొనసాగాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. మరోమారు ఇలాంటి తప్పిదాలు జరిగితే సహించేది లేదని, వాటర్ మ్యాన్, చెత్త సేకరణ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. విధులు నిర్వహించే వారు రాజకీయాల జోలికి పోవద్దని, ఎవరైనా రాజకీయం చేస్తే క్షమించేది లేదని హెచ్చరించారు. భగీరథ నీటి సరఫరా చేసే ట్యాంకు పరిశీలించారు. పారిశుద్ధ్య చర్యలకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భగీరథ గ్రిడ్ డీఈ సువర్చల, గ్రామ ప్రత్యేకాధికారి కమల, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవి, కార్యదర్శి తబుసమ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


ట్యాంక్ వద్ద నీటి సరఫరా తీరును పరిశీలిస్తున్న అధికారులు

వంతెన శిథిలం.. వెతలు అధికం



మోమిన్‌పేట్ - శంర్‌పల్లి ప్రధాన రహదారిలోని ఎన్కతల వద్ద దశాబ్దాల క్రితం ఈ వంతెన నిర్మించారు. మరమ్మతులు చేయక పోవడంతో శిథిల దశకు చేరింది. కనీసం రక్షణ గోడలు కూడా నిర్మించక పోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రక్షణ చువ్వలు వంగిపోయాయి. రాత్రివేళ వాహనదారులు వీటిని గుర్తించలేక కిందపడి గాయాల పాలవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి వంతెనకు మరమ్మతులు చేపట్టడంతోపాటు, రక్షణ గోడలు నిర్మించాల్సి ఉంది. – ఈనాడు, వికారాబాద్, న్యూస్‌టుడే, మోమిన్‌పేట.

మన చేతుల్లోనే ఆరోగ్యం




● సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక మొదలు ఐదో తరగతి వరకు 94 మంది చదువుతున్నారు. నిత్యం ఉదయాన్నే ప్రార్థన సమయంలో చేతుల శుభ్రతపై ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు. ద్రావణాన్ని అందుబాటులో ఉంచుతున్నారు. ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తున్నారు. పిల్లల ఆరోగ్యానికి ఇలా జాగ్రత్తలు తీసుకుంటున్నామని హెచ్ఎం సయ్యద్ సంధాని చెబుతున్నారు. వంట నిర్వాహకుల విషయంలోనూ ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు.


బక్రిచెప్యాల ప్రాథమిక పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ సంధాని

న్యూస్‌టుడే, సిద్దిపేట, వికారాబాద్ కలెక్టరేట్, తాండూరు

ఆరోగ్యమే మహాభాగ్యం. ఇందుకు ప్రతీ అంశం కీలకమే. దినచర్యలో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే.. సురక్షిత జీవనం సొంతం. చేతుల శుభ్రత అత్యంత ప్రాధాన్యంతో కూడుకుంది. తద్వారా ఎన్నో రోగాల నుంచి కాపాడుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. ఇటీవల ఆరోగ్య స్పృహ పెరిగినా.. విద్యాలయాల్లో కచ్చితంగా అమలు చేయాలి. నేడు ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా సిద్దిపేటకు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డా. రామ్మోహన్ ఇలా వివరించారు.

జిల్లాలో ఇలా..
జనాభా: 12.5 లక్షలు
అన్ని రకాల విద్యాలయాలు (1-10వ తరగతి వరకు): 1623
విద్యార్థులు: 2.39 లక్షలు




అపరిశుభ్రతతో..

అనారోగ్యానికి కారణం. చిన్నారుల్లో అవగాహన లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఒకప్పటితో పోలిస్తే కొంత మార్పు కనిపిస్తోంది. విద్యాసంస్థల్లో మాత్రం భిన్నమైన పరిస్థితి నెలకొంది. అత్యధిక చోట్ల నీటి వసతి ఉన్నా సబ్బు లేదా ద్రావణాలు ఉంచడం లేదు. మధ్యాహ్న భోజనం, స్నాక్స్ తినే ముందు, ఆడినప్పుడు, శౌచాలయానికి వెళ్లినప్పుడు మాములుగా శుభ్రం చేసుకుంటున్నారు. విద్యాసంస్థల నిర్వాహకులు దీనిపై శ్రద్ధ వహించాలి. గ్రామాల్లో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్ఎంలు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి.

ఇలా చేద్దాం..

- భోజనానికి ముందు చేతుల శుభ్రత తప్పనిసరి. ఒక నిమిషం ఇందుకు కేటాయించాలి.
- దగ్గినా, తుమ్మినా విస్మరించొద్దు.
- మల, మూత్ర విసర్జన తర్వాత కాళ్లు, చేతులు కడుక్కోవాలి.
- పాఠశాలల్లో ద్రావణం లేదా సబ్బును అందుబాటులో ఉంచాలి.
- ఉంగరాలు పెట్టుకునే చేతి వేళ్లను ఎక్కువ శుభ్రం చేయాలి.
- వైరస్, బ్యాక్టీరియాలు ఒంట్లోకి చేరేందుకు చేతులే వాహకాలు. కళ్లు, ముక్కు, నోటిని తరచూ చేతులతో తాకే ప్రయత్నం చేయొద్దు.
- చేతుల శుభ్రత అలవాటుగా మారితే అనారోగ్య సమస్యల నుంచి 90 శాతం భద్రంగా ఉన్నట్టే.

చేతుల శుభ్రతపై వివిధ వర్గాలకు చెందిన 200 మందితో 'న్యూస్‌టుడే' బృందం సర్వే నిర్వహించగా ఇలా స్పందించారు.



బాధ్యత వహిస్తే..

సబ్బు లేదా ద్రావణంతో చేతుల శుభ్రతతో అతిసారం 30 శాతం, శ్వాసకోశ వ్యాధులను 20 శాతం వరకు నివారించవచ్చు. కలరా, ఎబోలా, హెపటైటిస్-ఈ తదితర వాటి కారకాల వ్యాప్తిని అడ్డుకోవచ్చు. కడగకుండా అల్పాహారం, ఆహారం తీసుకుంటే హానికర క్రిములు పొట్టలో చేరే అవకాశం మెండు. కొన్ని సందర్భాల్లో టైఫాయిడ్, కడుపునొప్పి, విరేచనాల బారిన పడుతుంటారు. తల్లిదండ్రులు బాధ్యతగా బాల్యంలోనే అవగాహన కల్పించాలి.

అలవాటు చేస్తూ..



వికారాబాద్‌లోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో హ్యాండ్‌వాష్, సబ్బు అందుబాటులో ఉంచుతున్నారు. ప్రధానోపాధ్యాయుడు జాక వెంకటేశం పక్కాగా పర్యవేక్షిస్తున్నారు. విద్యార్థులకు దీన్ని అలవాటుగా మారుస్తున్నారు. ఈ బడిలో 378 మంది చదువుకుంటున్నారు. ఇంట్లోనూ పాటించాల్సిన పద్ధతుల గురించి ప్రత్యేకంగా వివరిస్తున్నారు. తరచూ స్థానిక వైద్యులతో సమావేశాలు నిర్వహిస్తూ చైతన్యం తీసుకొస్తున్నారు.


భారీ వర్షం.. జన జీవనానికి అంతరాయం

పెద్దేముల్, న్యూస్‌టుడే: జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. బషీరాబాద్ మండలంలో మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి రోడ్లు, కాలనీలు జలమయం అయ్యాయి. సుమారు గంటపాటు వర్షం దంచి కొట్టి జన జీవనానికి అంతరాయం ఏర్పడింది.

తాండూరు: తాండూరులో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి చించోళి రోడ్డులో స్తంభాలకు ఉన్న తీగలు తెగి పడ్డాయి. విషయాన్ని గమనించిన అధికారులు 33/11 కె.వి నుంచి పట్టణానికి మొత్తం విద్యుత్తు సరఫరాను స్తంభింప చేశారు. ఇంజినీర్ల ఆధ్వర్యంలో సిబ్బంది గంట వ్యవధిలో తీగలను సరిచేసి సరఫరాను పునరుద్ధరించారు.


పెద్దేముల్ మైదానంలో నిలిచిన వరద

తరుణీ.. శక్తిస్వరూపిణి



గ్రామీణ మగువ.. కొంగు నడుముకు బిగించి పొలంలో పంట పండించి రైతుగా అన్నం పెడుతోంది.. ఉపాధి హామీ పథకంలో స్వేదాన్ని చిందించి గ్రామీణ వలసల నివారణకు చోదకశక్తిలా నిలుస్తోంది.. పొదుపు ఉద్యమానికి హారతి పడుతోంది.. రుణాలతో స్వయం ఉపాధికి బాటలు వేసుకొని ఆర్థిక స్వావలంబనకు ప్రతీకగా నిలుస్తోంది.. ఒకప్పుడు వంటింటికే పరిమితమైన గ్రామీణ మహిళలు నేడు శక్తిగా మారి అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నారు.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలుస్తుండటం విశేషం. నేడు 'అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం' నేపథ్యంలో ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో సమస్యలు అధిగమించి విజయాలు సాధించిన వారిపై 'న్యూస్‌టుడే' కథనం.

నేడు ప్రపంచ గ్రామీణ మహిళా దినోత్సవం

	మహిళలు (లక్షల్లో..)	పొదుపు సంఘాలు	సభ్యులు(లక్షల్లో..)
సంగారెడ్డి	4.90	18,208	1.91
సిద్దిపేట	4.47	18,274	1.94
వికారాబాద్	4.26	15,525	1.62
మెదక్	3.88	13,061	1.37

– న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్, సిద్దిపేట, మెదక్, వికారాబాద్ కలెక్టరేట్

ప్రధాని నుంచి సత్కారం

వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం హస్నాబాద్‌కు చెందిన కంతి లక్ష్మి జాతీయస్థాయిలో ఉత్తమ పారిశుద్ధ్య కార్మికురాలిగా ఎంపికై గ్రామీణ మహిళ ఎందులోనూ తక్కువ కాదని నిరూపించారు. జనవరి 26న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. పారిశుద్ధ్య కార్మికురాలిగా గ్రామం స్వచ్ఛంగా ఉంచడంలో కీలకపాత్ర పోషించారు. ఈమె చిత్తశుద్ధిని గమనించిన అధికారులు ఆమెను ఎంపిక చేశారు. ఈమె భర్త కంతి సైదప్ప. వీరికి ఎకరం పొలం ఉంది. మూడేళ్ల క్రితం భర్త అనారోగ్యం పాలవడంతో ఆయన స్థానంలో ఉద్యోగంలో చేరారు. రోజూ తడి, పొడి చెత్త వేరు చేయడం.. ఇనుము, గాజు అమ్మకం ద్వారా పంచాయతీకి ఆదాయం వచ్చేలా చేస్తున్నారు. వ్యర్థాల నుంచి సేంద్రియ ఎరువుగా మార్చడం వంట పనులు నిర్వహిస్తారు. – న్యూస్‌టుడే, కొడంగల్



ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో లక్ష్మి

అతివలకు అండగా నిలుస్తూ..



చింతల లక్ష్మి

ఆమె చదివింది ఐదో తరగతే. అయినా తనవంతుగా ఏదైనా చేయాలన్న సంకల్పంతో అడుగేసి నిస్సహాయులకు అండగా నిలుస్తున్నారు. ఆమె నర్సాపూర్ మండలం లింగాపూర్‌కు చెందిన చింతల లక్ష్మి. కొన్నాళ్ల కిందట గ్రామంలో భువనేశ్వరి స్వయం సహాయక సంఘాన్ని ఏర్పాటుచేశారు. స్థానిక మహిళలకు అవగాహన కల్పించి సంఘంలో చేర్పించి పొదుపు బాట పట్టించారు. ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవడంపై చైతన్యం తీసుకొస్తూ ఎంతోమంది ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేశారు. ఇలా జిల్లా స్థాయి కమ్యూనిటీ రిసోర్స్‌పర్సన్‌గా ఎదిగారు. ఉమ్మడి జిల్లా సమాఖ్యకు అధ్యక్షురాలిగా సైతం పని చేశారు. మరోవైపు అక్షరాస్యత పెంచేందుకు గ్రామీణ మహిళలకు చదువు నేర్పించారు. గ్రామాల్లో సేంద్రియ సాగుపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతం ఐకేపీ జెండర్ పాయింట్ పర్సన్‌గా పనిచేస్తున్నారు. దంపతుల మధ్య వివాదాల పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, నర్సాపూర్

వీఓఏ నుంచి పారిశ్రామికవేత్తగా..

హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామానికి చెందిన బోయిని కనకతార వీఓఏగా పని చేస్తూనే వ్యాపారంలో రాణిస్తున్నారు. స్వయం సహాయక బృంద సభ్యురాలి నుంచి జాతీయ స్థాయికి ఎదిగి ఆదర్శంగా నిలిచారు. అరుంధతి సంఘం సభ్యురాలిగా అడుగేసిన ఈమె 2005 నుంచి వీఓఏ (సీఏ)గా పని చేస్తున్నారు. 2012లో టైలరింగ్ యూనిట్ ఏర్పాటుచేశారు. 40 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. తర్వాత రూ.కోటితో వేర్వేరు జిల్లాల్లో వస్త్ర సంచులు, పళ్లేల తయారీ యూనిట్లనూ నెలకొల్పారు. ఈ నెల 17న దిల్లీలో జరిగే జాతీయస్థాయి పారిశ్రామికవేత్తలు, బ్యాంకర్ల సదస్సులో పాల్గొనే అవకాశాన్ని అందుకున్నారు.

– న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం



వస్త్ర సంచుల తయారీలో కనకతార

ఇటు పొలం.. అటు చిత్రీకరణ



సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం హుమ్నాపూర్‌కు చెందిన లక్ష్మమ్మ చిన్నతనం నుంచి వ్యవసాయ కూలీగా పని చేస్తూ వచ్చారు. ఈ క్రమంలో జహీరాబాద్‌కు చెందిన దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్)లో చేరిన తర్వాత ఆమె దశ మారింది. సంస్థ నిర్వాహకుల ప్రోత్సాహంతో వీడియో చిత్రీకరణ నేర్చుకున్నారు. 35 ఏళ్లకు పైగా పలు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై వీడియోలు తీసి గుర్తింపు దక్కించుకున్నారు. 52 ఏళ్ల ఈ మహిళ సేంద్రియ విధానంలో చిరుధాన్యాలను సాగు చేస్తున్నారు. సంప్రదాయ పద్ధతిలో విత్తనాలను నిల్వ చేస్తూ సంస్థకు, రైతులకు అందిస్తున్నారు. వివిధ రాష్ట్రాలతో పాటు 11కు పైగా దేశాల్లో పలు సమావేశాలను చిత్రీకరించారు. – న్యూస్‌టుడే, జహీరాబాద్

క్రీడాకారిణులను తీర్చిదిద్దుతూ..



సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం మాటిండ్లకు చెందిన భాగ్యమ్మ.. ఫుట్‌బాల్ శిక్షకురాలిగా ఎంతో మంది క్రీడాకారిణులను తీర్చిదిద్దుతున్నారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఈమె హకీంపేట క్రీడా పాఠశాలలో శిక్షణ పొందారు. రాష్ట్ర స్థాయిలో 6 స్వర్ణ పతకాలు సాధించారు. 12 సార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. మెదక్‌లోని ఇందిరాగాంధీ మైదానంలో నిత్యం 80 మంది విద్యార్థినులకు మెలకువలు నేర్పిస్తున్నారు. ఈమె పర్యవేక్షణలో శిక్షణ పొందిన సీనియర్ మహిళా జట్టు గత నెలలో నిజామాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఫైనల్‌కు చేరుకుంది. తాజాగా మెదక్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలికల రాష్ట్ర స్థాయి పోటీల్లో మెదక్ జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. – న్యూస్‌టుడే, మెదక్ టౌన్

జాతీయ యోగా పోటీలకు ఎంపిక



మాధవి, శాకేర

కొండాపూర్: జాతీయ స్థాయి యోగా పోటీలకు కొండాపూర్ మండలం గంగారం ఉన్నత పాఠశాల విద్యార్థులు మాధవి, శాకేర ఎంపికయ్యారని జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌కుమార్, రమేశ్ సోమవారం తెలిపారు. పటాన్‌చెరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారన్నారు. నవంబరు 11 నుంచి 14 వరకు అస్సాంలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారు.

కథ రాసి.. బహుమతి దక్కించుకొని..



ప్రహర్షి

సిద్దిపేట, న్యూస్‌టుడే: హైదరాబాద్‌కు చెందిన మాచిరాజు బాల సాహిత్య పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన కథల పోటీల్లో నారాయణరావుపేట మండలం జక్కాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని ప్రహర్షి ప్రతిభ కనబర్చారు. విద్యార్థిని రాసిన 'సాహసం' కథ ప్రోత్సాహక బహుమతికి ఎంపికైంది. పోటీలకు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన 232 కథల్లో 28 వివిధ విభాగాల్లో ఉత్తమంగా నిలిచాయి. వాటిలో ప్రహర్షి రాసిన కథ ఒకటవడం విశేషం. నవంబరు 3న హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసాపత్రం ప్రదానం చేయనున్నారు. ఆమెను హెచ్‌ఎం షౌకత్‌అలీ, ఉపాధ్యాయులు అభినందించారు.



న్యాల్‌కల్ బసవన్నకు జాతీయస్థాయి గుర్తింపు

జహీరాబాద్ అర్బన్(న్యాల్‌కల్), న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌కు చెందిన ప్రముఖ చిత్రకారుడు హోతి బస్వరాజు రూపొందించిన 'మాడ్రన్ హస్బెండ్రీ' కళాకృతి జాతీయస్థాయి పోటీల్లో ద్వితీయ బహుమతి దక్కించుకుంది. పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో 'ఇండియన్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్' నిర్వహించే 'ఆల్ ఇండియా ఎగ్జిబిషన్ ఆఫ్ ఆర్ట్స్-2024' పోటీల్లో దీన్ని ప్రదర్శించారు. ఈనెల 26న బస్వరాజు పురస్కారం అందుకోనున్నారు.

నూతన ఆవిష్కరణలే లక్ష్యం

ఐఐటీహెచ్-కెన్యా బృందం ఒప్పందం



ఐఐటీహెచ్‌లో కెన్యా బృందం సభ్యులు

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: కెన్యా నేషనల్ ఇన్నోవేషన్ ఏజెన్సీ బృందం రెండు రోజుల పర్యటనలో భాగంగా ఐఐటీహెచ్‌ను సోమవారం సందర్శించింది. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో నూతన ఆవిష్కరణలే లక్ష్యంగా ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన టెక్నాలజీ ఇంక్యుబేషన్ సెంటర్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఇండియా-కెన్యా ఇన్నోవేషన్ నెక్సస్ పేరుతో రూపొందించిన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. కెన్యా పార్లమెంట్ సభ్యులు ఎదిత్ వెతి నైన్జ్, అమినా దికా అబ్దుల్లాహితోపాటు 11 విశ్వవిద్యాలయాల ప్రతినిధులు బృందంలో ఉన్నారు. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి మాట్లాడుతూ తాజాగా కుదుర్చుకున్న ఒప్పందంతో ఇరు దేశాలకు ప్రయోజనం చేకూరనుందన్నారు. సాంకేతిక, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ రంగాల్లో సంయుక్త పరిశోధనలకు మార్గం సుగమం కానుందని పేర్కొన్నారు.

అబ్దుల్‌కలాంకు చిత్ర నివాళి



భారత క్షిపణి పితామహుడు, ప్రపంచం గర్వించదగ్గ గొప్ప శాస్త్రజ్ఞుడు, భారతరత్న, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం జయంతిని మంగళవారం జరుపుకోనున్నారు. ఈ నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన పత్రచిత్రకారుడు గుండు శివకుమార్ ఎండిన రావి ఆకులపై మిస్సైల్ మ్యాన్ చిత్రాలు, పచ్చి ఆకులపై కలాం చిత్రాలు, అరచేతిలో, చేతివేలి గోర్లపై కలాం చిత్రాలు, కాగితంపై క్షిపణి, కలాం వివిధ వయస్సులోని చిత్రాలను మలిచి చిత్ర నివాళులు అర్పించారు.

– న్యూస్‌టుడే, నారాయణఖేడ్

సాహిత్యంతో సమాజంలో మార్పు సాధ్యం



శ్రీయశస్విని గ్రంథం విడుదల చేస్తున్న కవులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: మంచి మాటలు, సాహిత్యం ద్వారా సమాజంలో మార్పు సాధ్యమని ప్రముఖ కవి, అవధాన విద్యాపీఠం అధ్యక్షుడు మరుమాముల దత్తాత్రేయశర్మ అన్నారు. సిద్దిపేటలోని వ్యాసమహర్షి యోగా కేంద్రంలో సోమవారం శ్రీయశస్విని గ్రంథ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఆయన హాజరై మాట్లాడారు. పద్యం ప్రాచీనమైన ప్రక్రియ అయినా నిత్యనూతనంగా, ఉత్తేజితంగా సమాజానికి చేరుతుందన్నారు. 180 మంది కవులతో ఏకమకుటంతో 1800లకు పైగా పద్యాలు చదివే అవకాశం శ్రీయశస్విని గ్రంథం ద్వారా లభించటం సంతోషకరమన్నారు. కవులకు, కళాకారులకు పుట్టినిల్లు సిద్దిపేట అన్నారు. పుస్తక సంపాదకులు, అవధాని డా. బోచ్కర్ ఓంప్రకాశ్ మాట్లాడుతూ.. శ్రీయశస్విని గ్రంథంలోని ప్రతీపద్యం జనజీవనంలోని అంశాలను గుర్తు చేస్తాయన్నారు. కార్యక్రమంలో కవులు ఉండ్రాళ్ల రాజేశం, సాయిప్రసాద్, ఎన్నవెల్లి రాజమౌళి, సతీష్, రాజ్‌కుమార్, జబర్దస్త్ లక్ష్మీకిరణ్, సింగితం నరసింహారావు, లక్ష్మయ్య, రంజిత్‌కుమార్, ఫణీంద్ర, లక్ష్మి పాల్గొన్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	126–00	డ్రెస్డ్	215–00
రిటైల్	148–00	స్కిన్‌లెస్	244–00

రైతేరాజు

సాగు పద్ధతులు, చీడపీడల నివారణ, సస్యరక్షణపై రైతుల ప్రశ్నలకు సిద్దిపేట తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం సమన్వయ కర్త విజయ్ సమాధానాలు ఇచ్చారు.

సాగులో సందేహాలా?
సంప్రదించాల్సిన ఫోన్ నం:
93815 15588

ప్రశ్న: బెండ తోటకు పచ్చదోమ ఆశించింది. ఏం చేయాలి? – విజయ్, కొండాపూర్

సమాధానం: పచ్చదోమ కాయలను తినేసి నష్టపరుస్తుంది. ఇమిడాక్లోప్రిడ్ 1 మి.లీ... లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది. – న్యూస్‌టుడే, చేర్యాల

చేపల ఎదుగుదలకు పొటాషియం పర్మాంగనేట్

చేపల పెంపకంలో పలు రకాల జాగ్రత్తలు తీసుకోవాలి. చెరువుల్లో సున్నం, సాధారణ ఉప్పు, పొటాషియం పర్మాంగనేట్, కాపర్ సల్ఫేట్ వినియోగించడం మంచిది. సున్నం నీటి నాణ్యతను మెరుగుపరుస్తుంది. పొటాషియం పర్మాంగనేట్ చేపల్లో వ్యాధినిరోధక శక్తిని పెంచుతుంది. కాపర్ సల్ఫేట్‌తో ఫంగస్, శంకుపూత వ్యాధులను అరికట్టవచ్చు. ఇక ప్రోటోజోవన్, క్రస్టేషియన్ పరాన్నజీవుల నిర్మూలనకు ఉపయోగపడుతుంది.

– న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్

సెనగ సాగు.. సమయం ఆసన్నం!

న్యూస్‌టుడే, చేర్యాల





విజయ్

పప్పు దినుసులకు ఎల్లప్పుడూ డిమాండ్ ఉంటుంది. వాటిలో కంది తర్వాత సెనగ పప్పుది రెండో స్థానం. అయితే సెనగ సాగుకు ప్రస్తుతం అనుకూలమైన సమయం. ముఖ్యంగా నల్లరేగడి భూముల్లో దీన్ని సాగు చేస్తే అధిక దిగుబడులు సాధ్యమని సిద్దిపేట తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం సమన్వయకర్త, సీనియర్ శాస్త్రవేత్త డాక్టరు జక్కుల విజయ్ సూచిస్తున్నారు. వివరాలు ఇలా..

అక్టోబరు- నవంబరు నెలల్లో సెనగ సాగు చేయవచ్చు. నల్లరేగడి నేలలు అనుకూలం. ఈ నేలల్లో నిల్వ ఉండే తేమను ఉపయోగించుకుంటూ మొక్కలు పెరుగుతాయి. చౌడు నేలలు పనికి రావు. తొలకరిలో వేసిన పైరును కోసిన తర్వాత భూమిని నాగలితో ఒకసారి, గొర్రుతో రెండుసార్లు మెత్తగా దున్ని చదును చేసుకోవాలి.

రకాలు, మోతాదు..

జె.జి.11, జె.ఎ.కె.ఐ.9218, కె.ఎ.కె.2, క్రాంతి(ఐ.సి.సి.37), శ్వేత(ఐ.సి.సి.వి.2), అన్నెగిరి, జ్యోతి, ఐ.సి.సి.వి.10 రకాలు మేలైనవి. వీటన్నింటి పంట కాలం 90-110 రోజులు. ఎకరాకు 6-10 క్వింటాళ్లు దిగుబడి వస్తుంది. ఎకరాకు 30-40 కిలోల విత్తనం అవసరం. విత్తనశుద్ధి తప్పనిసరి.


ఎరువులు, నీటి యాజమాన్యం..

ఎకరాకు 8 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం, 16 కిలోల గంధకాన్ని ఇచ్చే ఎరువులను చివరి దుక్కిలో వేసుకోవాలి. సెనగ వర్షాధారపు పంట. తేలికపాటి నీటి తడులు పెడితే సరిపోతుంది. పొలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. పూత, కాయ దశల్లో తడులు అందించాలి.

అంతర కృషి..

విత్తే ముందు ఫ్లూక్లోరాలిన్ 45 శాతం మందును ఎకరాకు లీటరు చొప్పున పిచికారీ చేసి భూమిలో కలియదున్నాలి. లేదంటే పెండిమిథాలిన్ 30 శాతం మందును ఎకరాకు 1- 1.5 లీటర్లు చొప్పున విత్తిన వెంటనే గాని మరుసటి రోజు గానీ పిచికారీ చేయాలి. విత్తిన 20-25 రోజుల తర్వాత గొర్రుతో అంతరకృషి చేయాలి. పంటకు పచ్చ, రబ్బరు పురుగుల బెడద ఉంటుంది. ఎండు తెగులు, వేరుకుళ్లు తెగుళ్లు సోకుతుంది. వీటి నివారణకు అందుబాటులో ఉండే వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి. కోతకు వచ్చిన మొక్కలను పీకి ఆరబెట్టాలి. ఆరిన తర్వాత వారం రోజుల వరకు కుప్ప కట్టి ఉంచాలి. తర్వాత నూర్పిడి చేయాలి.

సాగుపై మక్కువ.. లాభాల ఆర్జన





నర్సింలు

ఆ యువకుడికి సాగంటే ఎంతో మక్కువ. డిగ్రీ పూర్తిచేశాక ఉన్నత విద్య చదివేందుకు వెళ్లకుండా ఇష్టమైన వ్యవసాయంపై దృష్టిసారించారు. అందులోనూ అందరిలా కాకుండా కాలానికి అనుగుణంగా పంటలు పండిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. అతడే మెదక్ జిల్లా పాపన్నపేటకు చెందిన సిందోల్ నర్సింలు. డిగ్రీ పూర్తయ్యాక సాగుపై ఇష్టంతో సంబంధిత విషయాలు తెలుసుకున్నారు. మెలకువలు నేర్చుకున్నారు. ఏ కాలంలో దేనికి డిమాండ్ ఉంటుందో గమనించారు. ఆయనకు మొత్తం 12 ఎకరాల పొలం ఉంది. ఏటా దసరా, దీపావళి పండగల సందర్భంగా మూడు నెలల ముందుగా ఎకరా పొలంలో బంతి సాగు చేస్తున్నారు. నారును హైదరాబాద్ నుంచి తీసుకొస్తున్నారు. పక్కాగా సస్యరక్షణ చర్యలు పాటిస్తున్నారు. నారింజ, పసుపు వర్ణాలకు సంబంధించిన పూలను పండిస్తున్నారు. వ్యవసాయాధికారుల సూచనలతో అవసరం మేర పురుగు మందులు వాడుతున్నారు. మూడు నెలల్లో మూడు కోతల మేర దిగుబడి వస్తోంది. నారు, కూలీలు, మందులు తదితర వాటికి రూ.50 వేల వరకు ఖర్చవుతోంది. మూడు కోతల్లో 5 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. హైదరాబాద్, మెదక్, సంగారెడ్డి మార్కెట్లకు తరలించి విక్రయిస్తున్నారు. తద్వారా రూ.2 లక్షల వరకు ఆదాయం ఆర్జిస్తున్నారు. ఖర్చులన్నీ పోగా రూ.1.50 లక్షలు లాభం మిగులుతోంది. మిగతా సమయాల్లో కూరగాయలు పండిస్తున్నారు. – న్యూస్‌టుడే, పాపన్నపేట

పాటించు.. నివారించు..

కాకర పంటలో ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులతో ఆకుల మధ్య పచ్చగా మారి ఈనెలు ఉబ్బుతున్నాయి. బూజు తెగులు ఆశించి ఇలా జరుగుతుంది. ఆకులు సైతం కిందికి ముడుచుకుపోతాయి. దీని నివారణకు మెటలాక్సిల్, మాంకోజెబ్ 2 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది. – న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్

తెల్లజొన్నలో విత్తనశుద్ధి కీలకం

యాసంగిలో రైతులు తెల్లజొన్న సాగు చేపడతారు. విత్తు దగ్గర నుంచి పంట చేతికొచ్చే వరకు సస్యరక్షణ చర్యలు చేపడితే ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి సాధ్యమని తాండూరు వ్యవసాయ పరిశోధనా స్థానం జొన్న పంట శాస్త్రవేత్త డాక్టర్ సుజాత తెలిపారు. నల్లరేగడి భూములు పంట సాగుకు అనుకూలం. మొక్కల వరుసల మధ్య దూరం అడుగున్నర, మొక్కకు మొక్కకు మధ్య అరడుగు దూరం పాటించాలి. పంట నాలుగు నెలల్లో చేతికొస్తుంది. విత్తనాలు నాటే ముందు శుద్ధి చేయాల్సిందే. కిలో విత్తనానికి 7మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ లేదా 2గ్రా. థయామిథాక్సమ్‌ను కలిపి విత్తన శుద్ధి చేయాలి. లేదంటే నెల రోజుల్లో మొవ్వ తొలుచు పురుగులు ఆశిస్తాయి. – న్యూస్‌టుడే, తాండూరు

వనరుల సంరక్షణతోనే నీటి ఎద్దడి నివారణ



గ్రామస్థులతో మాట్లాడుతున్న మర్రి శశిధర్‌రెడ్డి


గొడిగార్‌పల్లి(కోహీర్), న్యూస్‌టుడే: జల వనరుల సమర్థ నిర్వహణతో భూగర్భ జలాలు పెరిగి, భవిష్యత్తులో ఎద్దడి నివారణ సాధ్యమవుతుందని జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ మాజీ ఉపాధ్యక్షుడు మర్రి శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాలోని కోహీర్ మండలం గొడిగార్‌పల్లి సమీపంలో కొన్నేళ్ల కిందట 'చతుర్విధ జల ప్రక్రియ' ద్వారా ఏర్పాటు చేసిన వాటర్‌షెడ్ పథకం నిర్మాణాన్ని సోమవారం ఆయన పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తమ్‌రెడ్డి, మాజీ సర్పంచి రాచయ్య తదితరులు పాల్గొన్నారు.

మితిమీరిన వేగం.. అదుపుతప్పిన వాహనం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం




మల్లేశం



రసూల్‌ఖాన్

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: దసరా పండుగకు స్వగ్రామానికి వచ్చిన ఓ యువకుడు మిత్రులను కలిసేందుకు ద్విచక్రవాహనంపై వేరే గ్రామానికి వెళ్లి, తిరిగి వస్తూ వేగాన్ని నియంత్రించలేక, ఆందోళనకు గురై రోడ్డు దాటుతున్న ఇద్దరిని ఢీకొట్టగా వారిలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. చివరకు వాహనాన్ని అదుపు చేయలేక తానూ కిందపడి దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన సిద్దిపేటలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. సిద్దిపేట టూటౌన్ పోలీసులు తెలిపిన ప్రకారం సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లి గ్రామానికి చెందిన ముడికె మల్లేశం (32) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పని చేస్తున్నాడు. దసరా పండుగకు సొంతూరికి నాలుగురోజుల కిందట వచ్చాడు. ఆదివారం స్నేహితులను కలుద్దామని, మిట్టపల్లికి ద్విచక్ర వాహనంపై వెళ్లి, అదేరోజు అర్ధరాత్రి తిరుగు పయనమయ్యాడు. సిద్దిపేట రంగీలా దాబా చౌరస్తా వద్ద రోడ్డు దాటుతున్న డ్రైవర్లు గణేశ్, రసూల్ ఖాన్ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గణేశ్ గాయపడగా, రసూల్‌ఖాన్ (36) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనతో మరింత ఆందోళన గురైన మల్లేశం వాహన వేగం పెంచి, కొంత దూరం వెళ్లాక అదుపుతప్పి కిందపడి దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న మల్లేశం సోదరుడు అక్కడికి చేరుకుని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. మల్లేశానికి తల్లి, భార్య, కుమారుడున్నారు. రసూల్‌ఖాన్ స్వస్థలం కర్ణాటక బీదర్. ఆయన సోదరుడు అంజద్‌ఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

కారు బోల్తాపడి వృద్ధుడు..



నర్సయ్య

నార్సింగి(చేగుంట), న్యూస్‌టుడే: కారు అదుపుతప్పి బోల్తా పడటంతో అందులో ఉన్న వృద్ధుడు మృతిచెందిన ఘటన నార్సింగి మండలం వల్లూరు వద్ద సోమవారం జరిగింది. స్థానిక ఎస్సై అహ్మద్ మొహినొద్దీన్ తెలిపిన వివరాలు.. మాసాయిపేట మండలం అచ్చంపేటకు చెందిన కత్తెర నర్సయ్య(70) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బంధువు యాదగిరి వైద్యం కోసం నార్సింగిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకొచ్చాడు. కొన్ని పరీక్షలు హైదరాబాద్‌లో చేయించుకొని రావాలని వైద్యులు సూచించారు. దీంతో కొంపల్లికి వెళ్లి అక్కడ పరీక్షలు చేయించుకొని తిరిగి కారులో నార్సింగికి వస్తున్నారు. వల్లూరు దాటగానే కారు అదుపుతప్పి బోల్తాపడటంతో అందులో ఉన్న నర్సయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. కారు నడిపిస్తున్న యాదగిరితో పాటు మరో వ్యక్తి గాయపడ్డాడు. వారిని చికిత్స నిమిత్తం నార్సింగిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మృతుడి బంధువు సిద్ధిరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

కుంటలో పడి యువకుడు..



నితిన్

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: అనుమానాస్పదస్థితిలో కుంటలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన సిద్దిపేట శివారులో సోమవారం జరిగింది. పట్టణ మూడో థాణా సీఐ విద్యాసాగర్ తెలిపిన ప్రకారం సిద్దిపేట పట్టణం సుభాష్‌నగర్‌కు చెందిన పేర్ల నితిన్(22)కు ఏడాది కిందట పోస్టుమాస్టర్ ఉద్యోగం వచ్చింది. జగదేవపూర్ మండలం చాట్లపల్లిలో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆదివారం ఉదయం మిత్రుడు రోహిత్‌తో కలిసి ఇంటినుంచి బయటకు వెళ్లి, రాత్రైనా తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా, తాత పెంటయ్య వద్ద ఉన్నానని సమాధానం ఇచ్చాడు. సోమవారం ఉదయం ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. అనుమానంతో కుటుంబ సభ్యులు నితిన్ ఆచూకీ కోసం వెతుకుతుండగా, పట్టణ శివారులోని తిమ్మికుంట వద్ద అతని చెప్పులు కనిపించాయి. కుంటలో వెతికించగా మృతదేహం లభ్యమైంది. నితిన్‌కు తల్లి లక్ష్మి, తండ్రి రాజు, సోదరి ఉన్నారు. మృతిపై అనుమానం ఉందని తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదైందని సీఐ తెలిపారు.

తల్లి ఆస్తి పంచివ్వలేదని.. తనయుడి బలవన్మరణం

హత్నూర, న్యూస్‌టుడే: తనకు రావాల్సిన భూమి వాటాను తల్లి పంచివ్వడం లేదన్న మనస్తాపంతో కుమారుడు బలవన్మరణానికి పాల్పడ్డారు. మండల పరిధి దేవులపల్లిలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాలు.. దేవులపల్లికి మహ్మద్ మహబూబాకు షఫీ, యాదుల్లా కుమారులు. సోదరులిద్దరు వేర్వేరుగా నివాసం ఉంటున్నారు. ఉమ్మడి ఆస్తికి చెందిన భూమి తల్లి పేరిట ఉంది. షఫీ చిన్న కూతురి వివాహం నిశ్చితార్థమయింది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. తనకు రావాల్సిన భూమి వాటాను పంచివ్వాలని తల్లిపై ఒత్తిడి తెచ్చాడు. ఆమె ససేమిరా అనడంతో కుటుంబ సభ్యుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనోవేదనకు గురైన షఫీ గ్రామ సమీపంలోని ఎర్రకుంటలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్థుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీశారు. షఫీ భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


చెరువులో దూకి మరొకరు..



మల్లికార్జున్

శివ్వంపేట, న్యూస్‌టుడే: మద్యానికి బానిసై కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహిపాల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పిల్లుట్ల గ్రామానికి చెందిన లెంకల మల్లికార్జున్ (40) మద్యానికి బానిసయ్యాడు. ఇంట్లో భార్య మాధవితో గొడవపడి దసరా రోజు శనివారం పెద్ద చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. దసరా రోజు గ్రామస్థులకు చెరువు వద్ద కనిపించిన మల్లికార్జున్ అప్పటి నుంచి ఆచూకీ లేదు. సోమవారం చెరువు వద్ద చూడగా ఆయన మృతదేహం లభించింది. మృతుని భార్య ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదైంది. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పాముకాటుతో మహిళ మృత్యువాత



జ్యోతి

శివ్వంపేట, న్యూస్‌టుడే: పాముకాటుకు గురైన మహిళను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. శివ్వంపేట ఎస్‌ఐ మహిపాల్ రెడ్డి, గ్రామస్థులు తెలిపిన వివరాలు.. దంతాన్‌పల్లి గ్రామానికి చెందిన గేడి జ్యోతి(28) ఆదివారం సాయంత్రం ఇంటి దగ్గర గేదెలకు గడ్డివేసే క్రమంలో పాము కాటు వేసింది. వెంటనే కామారెడ్డి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. భర్త తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. జ్యోతికి భర్తతో పాటు నలుగురు కుమార్తెలు ఉన్నారు.

సమీకృత కార్యాలయానికి స్థల పరిశీలన


క్షేత్రస్థాయిలో కడా అధికారి వెంకట్‌రెడ్డి, సిబ్బంది

దుద్యాల, న్యూస్‌టుడే: మండల సమీకృత కార్యాలయ నిర్మాణం కోసం కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) అధికారి వెంకట్‌రెడ్డి సోమవారం దుద్యాలలో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలోని రైతువేదిక దగ్గర ఉన్న స్థలంతోపాటు దుద్యాల స్టేజీ దగ్గర ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. వీటిలో ప్రజలకు అనుకూలమైన దాన్ని ఎంపిక చేసి సమీకృత కార్యాలయ భవన నిర్మాణం పనులు చేపడుతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.వెంకటేశ్‌ప్రసాద్, ఆర్ఐ రవికిషోర్, కాంగ్రెస్ నాయకులు వెంకటయ్య, ఖాజా, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీరో విద్యుత్తు బిల్లులపై అర్జీలు స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న విజయ్‌కుమార్, ఉషశ్రీ

కొడంగల్: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు జీరో విద్యుత్తు బిల్లులు రావడం లేదని అర్జీలు ఇచ్చారని అధికారులు తెలిపారు. ఇందులో పింఛన్‌లకు సంబంధించిన దరఖాస్తులు వచ్చినట్లు ఆయా శాఖల అధికారులు తెలిపారు. వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. తహసీల్దార్ బి.విజయ్‌కుమార్, ఎంపీడీవో ఉషశ్రీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ తదితరులున్నారు.

రాడార్ స్టేషన్‌పై అపోహలు తొలగించండి

పూడూరు, న్యూస్‌టుడే: దామగుండంలో నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటుతో ప్రజల్లో వస్తున్న అపోహలను తొలగించి స్పష్టత ఇవ్వాలని భారాస పూడూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు రామచంద్రయ్య అన్నారు. పూడూరులో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆందోళన కలిగించే ప్రాజెక్టు ఏర్పాటుతో గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహించి అందరి అభిప్రాయంతోనే నిర్మాణం చేపట్టాలని కోరారు. నాయకులు సతీష్ పంతులు, కిరణ్, నరేశ్, రాములు ఉన్నారు.

నిరుపయోగంగా డంపింగ్ యార్డులు

న్యూస్‌టుడే, దుద్యాల, కొడంగల్ గ్రామీణం:

గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరించి వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం రూ.లక్షలు వ్యయంతో డంపింగ్ యార్డులను నిర్మించారు. ప్రస్తుతం కొన్నిచోట్ల అవి నిరుపయోగంగా మారాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని ఈర్లపల్లి, సంత్రకుంట తండా, రోటిబండ తండా, దుద్యాల, లగచర్ల తదితర గ్రామాల్లో దాదాపు రూ.2.50లక్షల చొప్పున వ్యయంతో డంపింగ్ యార్డులను నిర్మించారు. ఆయా గ్రామాల నుంచి ట్రాక్టర్ల ద్వారా చెత్త సేకరించి డంపింగ్ యార్డుకు తరలించి, ఆరబెట్టి వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేయాల్సి ఉంది. దీని ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూరే అవకాశం కూడా ఉంది. పంచాయతీ సిబ్బందితో చెత్త సేకరిస్తున్నప్పటికీ గ్రామస్థులు తడి, పొడి వేరు చేయడం లేదు. దీంతో చెత్త మొత్తం ఒకే దగ్గర కుప్పగా పోసి కాల్చేస్తున్నారు. డంపింగ్ యార్డు పక్కన నిర్మించిన శౌచాలయాలకు నీటి సరఫరా లేక వినియోగంలో లేవు. దీంతో ప్రభుత్వం చేసిన వ్యయం అంతా బూడిదలో పోసినట్లు మారిందని గ్రామస్థులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


దుద్యాలలో డంపింగ్ యార్డు

ఆయా చోట్ల పరిస్థితి:

దుద్యాలలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తున్నప్పటికీ తడి, పొడి చెత్త వేరు చేయడం లేదు. చెత్త మొత్తం ఒకచోట కుప్పగా పోస్తున్నారు. ప్లాస్టిక్, ఇనుప వస్తువులు, పేపర్స్, పుస్తకాలు, బాటిళ్లను డంపింగ్ యార్డులో నిర్మించిన అరల్లో సమకూర్చడం లేదు. తడి, పొడి చెత్త వేరు చేయాలని గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. సంత్రకుండ తండాలో డంపింగ్ యార్డు వినియోగంలో లేదు. లగచర్లలో కొన్ని ప్లాస్టిక్ వస్తువులను అరల్లో అమర్చినప్పటికీ పూర్తిస్థాయిలో వినియోగించడం లేదు. రోటిబండ తండాలో వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేయడం లేదు.

పూర్తిస్థాయి వినియోగానికి కృషి చేస్తా:

– మహేష్, ఎంపీవో, దుద్యాల

ఇప్పటికే తడి, పొడి చెత్త వేరే చేయాలని ఆదేశాలిచ్చాం. సిబ్బంది తక్కువగా ఉన్న చోట్ల మాత్రమే ఈ పరిస్థితి ఉంది. మండలంలో దాదాపు 70 శాతం డంపింగ్ యార్డులు వినియోగంలో ఉన్నాయి. వర్మీ కంపోస్టు ఎరువు తయారీకి బయటి నుంచి వానపాములు తెచ్చి కంపోస్టుపిట్‌లో వేస్తున్నాం. ఈ ఎరువును నర్సరీల్లో మొక్కల పెంపకానికి వినియోగిస్తున్నాం. మిగతా చోట్ల కూడా యార్డులను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేస్తాం.


యార్డు పక్కన చెత్త

న్యూస్‌టుడే, పూడూరు, కుల్కచర్ల, కుల్కచర్ల గ్రామీణ, మోమిన్‌పేట, దౌల్తాబాద్, తాండూరు టౌన్:

? పూడూరు మండలం చన్‌గోముల్ పాఠశాల సమీపంలో వ్యర్థాలు వేయడంతో అపరిశుభ్రంగా మారుతోంది. – శ్రీనివాస్, చన్‌గోముల్

✔ వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ వేసిన వారిపై చర్యలు తీసుకుంటాం. అవగాహన కల్పించి నివారణ చర్యలు చేపడతాం.
– పరశురాం, పంచాయతీ కార్యదర్శి

? ఉపాధిహామీ పథకం కింద కుల్కచర్లలో ఊటకుంటల నిర్మాణం చేపట్టాలి. దీంతో పరిసర ప్రాంతాల బోర్లలో నీటి లభ్యత పెరుగుతుంది. – రాములు, స్థానికుడు

✔ ఎక్కడైనా, ఎవరి పొలంలోనైనా ఊటకుంటల నిర్మాణానికి సహకరిస్తాం. సంబంధిత రైతులు క్షేత్రస్థాయి ఈజీఎస్ సిబ్బందిని సంప్రదించండి. – చంద్రశేఖర్, ఈసీ

? కుల్కచర్ల కల్యాణ్‌నగర్ కాలనీలో మురుగు నీరు ఇళ్ల మధ్య నిలిచిపోయి దోమలు ఎక్కువగా వ్యాపిస్తున్నాయి. దుర్వాసన కూడా వస్తోంది. – రాములు, స్థానికుడు

✔ గ్రామాల్లో మురుగు నీటి పారుదలకు అన్ని విధాలుగా ఏర్పాట్లు చేస్తున్నాం. వీలైనంత త్వరగా సమస్య పరిష్కరించేలా చూస్తాం.
– రామకృష్ణనాయక్, ఎంపీడీవో

? మోమిన్‌పేటలోని చంద్రశేఖర్ నగర్ కాలనీలో ఇళ్ల ముందు ఖాళీ స్థలాలలో ముళ్లపొదలు ఉన్నాయి. ఇళ్ల ఆవరణలో విష కీటకాలతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.
– శ్రీనివాస్, చంద్రశేఖర్ నగర్ కాలనీ,

✔ పొదలను పంచాయతీ సిబ్బందితో తొలగించి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. – స్వప్న, పంచాయతీ కార్యదర్శి.

? దౌల్తాబాద్ మండలం గోకఫస్లావాద్ నుంచి సుంకర్‌నగర్ వరకు ఉన్న మట్టిరోడ్డు గుంతలమయంగా మారింది. వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నాం. – నరేష్, గోకఫస్లావాద్

✔ గ్రామాలకు వెళ్లే మట్టిరోడ్లను బీటీదారులుగా మార్చేందుకు ప్రతిపాదనలు పంపాం. సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటాం. – రవికిరణ్, పీఆర్ ఏఈ, దౌల్తాబాద్

? తాండూరు పురపాలిక పరిధి సాయిపూరు కాలనీ ప్రాంతంలో తాగునీరు పూర్తిస్థాయిలో సరఫరా కావడం లేదు.
– ప్రదీప్, స్థానికుడు

✔ సాయిపూరు వీధుల్లో తాగునీటిని పూర్తి స్థాయిలో సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటాం.
– విక్రమ సింహారెడ్డి, పురపాలిక కమిషనరు

అంతారంలో విగ్రహ ప్రతిష్ఠాపన

కుల్కచర్ల గ్రామీణ, న్యూస్‌టుడే: మండల పరిధి పెద్దఅంతారంలో సోమవారం ఆంజనేయ స్వామి, శివలింగం, బొడ్రాయి ప్రతిష్ఠాపన ప్రారంభించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం వరకు ఉత్సవాలు కొనసాగుతాయన్నారు.

రామలింగేశ్వర ఆలయంలో భక్తుల పూజలు

పూడూరు, న్యూస్‌టుడే: దామగుండం రామలింగేశ్వర ఆలయానికి సోమవారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దసరా సెలవులకు చివరి రోజు కావడంతో కుటుంబ సమేతంగా చేరుకున్నారు. ప్రధాన కొలనులో స్నానాలు చేసి, స్వామిని దర్శించుకున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కుల్కచర్ల, న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రతి ఒక్కరు సహకరించాల్సిన అవసరం ఉందని భారాస మండలాధ్యక్షుడు శేరి రామ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రం కుల్కచర్ల వీరశైవ సమాజం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శివాలయానికి సోమవారం ఆయన రూ.లక్ష విరాళం అందజేశారు. ఆధ్యాత్మికత జీవితం మనిషికి ప్రశాంతత చేకూరుస్తుందని పేర్కొన్నారు.

ఫాంహౌస్ నిర్వాహకులు బాధ్యతగా మెలగాలి

మొయినాబాద్, న్యూస్‌టుడే: ఫాంహౌస్ నిర్వహకులు బాధ్యతగా మెలగాలని రాజేంద్రనగర్ జోన్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ సూచించారు. గ్రామపంచాయతీల నుంచి నిర్వాహకులు ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలన్నారు. మొయినాబాద్ మండలంలోని ఫాంహౌస్ నిర్వాహకులతో సోమవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఫాంహౌస్‌ల్లో ఈవెంట్‌లు నిర్వహించే వారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని, సౌండ్‌సిస్టం, మద్యం వినియోగానికి ఆన్‌లైన్‌లో అనుమతులు పొందాలన్నారు. ఈవెంట్‌కు సంబంధించిన పూర్తి వివరాలను స్థానిక పోలీసులకు ఇవ్వాలని ఆదేశించారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, ఫాంహౌస్‌కు వచ్చే ప్రతి ఒక్కరి వివరాలను సేకరించాలని సూచించారు. చేవెళ్ల ఏసీపీ కిషన్, మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ జి.పవన్‌కుమార్‌రెడ్డి, ఎస్సైలు నర్సింహారావు, ముజాఫర్‌అలీ, నహీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భవనం.. ఏళ్లుగా నిర్లక్ష్యం



మోమిన్‌పేట్ మండలం రావులపల్లి గ్రామంలో డ్వాక్రా భవనం అసంపూర్తిగా ఉంది. పదిహేనేళ్ల క్రితం భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. స్లాబు వరకు వేసి పనులు మధ్యలోనే వదిలేశారు. ఏళ్లు గడుస్తున్నా అలాగే ఉండడంతో కుక్కలు ఇతర జంతువులకు ఆవాసంగా మారింది. సంబంధిత అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించి పనులు పూర్తి చేసి భవనాన్ని వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.
– ఈనాడు వికారాబాద్, న్యూస్‌టుడే, మోమిన్‌పేట్:

పొదల మాటున ప్రయాణ ప్రాంగణం



ఇక్కడ ఉన్న చిత్రం మోమిన్‌పేట్ బస్టాండ్ ఆవరణ. పరిసరాల్లో అంతా పొదలు పెరిగి అపరిశుభ్రంగా మారింది. దీంతో పందులు, శునకాలు, పాములు సంచరిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు అక్కడ వేచి ఉండేందుకు ఇబ్బంది పడుతున్నారు. రాత్రిళ్లు మరింత అవస్థలు తప్పడం లేదు. ప్రాంగణం చుట్టూ పరిసరాల్లో మొక్కలు, పొదలు తొలగించి బాగుచేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.
– ఈనాడు వికారాబాద్, న్యూస్‌టుడే, మోమిన్‌పేట్:

మురుగే.. ముక్కు మూసుకుని పరుగే!



అల్లాపూర్ గ్రామంలో పాఠశాల సమీపంలో ఇళ్ల మధ్యలో మురుగు గుంత ప్రమాదకరంగా మారింది. దీంతో చిన్నారులు ఆడుకుంటూ అటుగా వెళ్తే ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉంది. వర్షాలకు గుంతలో నీరు చేరి ఈగలు, దోమలకు ఆవాసంగా మారింది. అంతే కాకుండా చెత్తాచెదారం చేరి దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. పలుమార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. – న్యూస్‌టుడే, ధారూర్

పశువైద్యశాల మూత.. వైద్యం అందక వెత



మండలంలోని గౌరారంలో పశువైద్యశాల మూతపడింది. గత పది నెలలుగా పశు వైద్యుడు, కాంపౌండర్ అందుబాటులో లేకపోవడంతో మూగజీవాలకు సకాలంలో వైద్యం అందడం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రధాన రోడ్డు పక్కనే పశువైద్యశాల భవనం మూతపడడంతో మందుబాబులకు అడ్డాగా మారిపోయిందని గ్రామస్థులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టిసారించి వైద్య సిబ్బందిని నియమించాలని వారు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, దుద్యాల**

బంపర్ డ్రా విజేతల ప్రకటన

వికారాబాద్, న్యూస్‌టుడే: కాసం ఫ్యాషన్స్ షాద్‌నగర్ దసరా మహోత్సవంలో భాగంగా ప్రకటించిన 'ప్రతి ఊరికి ఒక బైక్' బంపర్ డ్రా విజేతలను సోమవారం ప్రకటించారు. కొడంగల్‌కు చెందిన లావణ్య కూపన్ నంబర్ సీఏ33032159/24-1 విజేతగా నిలిచారు.

* కాసం ఫ్యాషన్స్ వికారాబాద్ దసరా మహోత్సవంలో భాగంగా ప్రకటించిన 'ప్రతి ఊరికి ఒక బైక్' బంపర్ డ్రా విజేతగా అరుణ్య కండలేని కూపన్ నంబర్ సీఏ40037926/10/24 విజేతగా నిలిచారు. .

బడిలో బల్లల విక్రయంపై విచారణ కరవు

కరణ్‌కోట (తాండూరు గ్రామీణ): కరణ్‌కోట జడ్పీ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల క్రితం అధికారులకు సమాచారం లేకుండా గుట్టుగా బల్లలు విక్రయించారు. దసరా సెలవులు కొనసాగుతుండగా చిన్నలారీలో పాఠశాల బల్లలు తరలించారు. ఈ వ్యవహారం అంతా పాఠశాల సమీపంలోని సీసీ కెమెరాల్లో నమోదైంది. గ్రామానికి చెందిన ఓ రాజకీయ నాయకుడు విక్రయించాడని స్థానికుల సమాచారం. బల్లల విక్రయంపై విద్యాశాఖ అధికారులు స్పందిస్తూ..తమకు సమాచారం లేదన్నారు. దీనిపై పోలీసులకు ఎవరూ ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం.

ఆగని పల్లెబస్సు.. ప్రైవేట్ వాహనాలే దిక్కు

దోమ: పరిగి వయా దోమ మీదుగా కోస్గికి ప్రతిరోజూ ఉదయం 11 గంటలకు బస్సు వెళుతుంది. తిరిగి అదే బస్సు మధ్యాహ్నం 1గంటలకు దోమ మీదుగా పరిగి చేరాల్సి ఉంటుంది. దసరా పండగ సందర్భంగా సోమవారం విపరీతమైన రద్దీ నెలకొంది. దీంతో దోమ మండల పరిధిలోని మల్లేపల్లి, ఐనాపూరం, పాలేపల్లి, తిమ్మాయపల్లి, ఊటుపల్లిలో బస్సు ఆగలేదు. దూర ప్రాంతాలకు వెళ్లే వారు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించక తప్పలేదు.

జిల్లా కేంద్రానికి బస్సులు లేక అవస్థలు

బొంరాస్‌పేట: కొడంగల్ నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి జిల్లా కేంద్రం వికారాబాద్‌కు బస్సులు నడపాలని ఆయా మండలాల ప్రజలు కోరుతున్నారు. ప్రజలు వివిధ పనుల కోసం నిత్యం జిల్లా కేంద్రానికి వస్తుంటారు. వికారాబాద్ రావాలంటే రెండు, మూడు బస్సులను మారి రావాల్సి వస్తుందన్నారు. ఆర్టీసీ అధికారులు చొరవ తీసుకుని కొడంగల్ నుంచి బొంరాస్‌పేట, మదన్‌పల్లి గ్రామాల మీదుగా బస్సులు నడిపితే కొడంగల్‌తో పాటు దుద్యాల, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. కోస్గిలో నూతనంగా బస్సు డిపో ప్రారంభమైనా డిపో నుంచి మండలాలకు బస్సులు నడపడం లేదు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చండి

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే విషయమై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షుడు రవీందర్ ఒక ప్రకటనలో కోరారు. ఎస్సీ జాబితాలో చేర్చాలని సుదీర్ఘ పోరాటం చేస్తున్నామని, 2016లో రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో మాట్లాడారని గుర్తుచేశారు. ఈ విషయమై ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశామన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

దౌల్తాబాద్, న్యూస్‌టుడే: జీవితంలో ఉన్నత జీవనానికి ప్రతీ ఒక్కరు తమకంటూ ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని విశ్రాంత ఎంఈవో బాబూసింగ్ అన్నారు. మండలంలోని గోకఫస్లావాద్ ఉన్నత పాఠశాలలో 2007-08 పదో తరగతి విద్యార్థులు సోమవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం చదువు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు.

బాధిత కుటుంబానికి మిత్రుల చేయూత

కుల్కచర్ల, న్యూస్‌టుడే: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ఇప్పాయిపల్లికి చెందిన యాదగిరి కుటుంబానికి అతనితో కలిసి 2007-08 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. సోమవారం బాధిత కుటుంబ సభ్యులను కలిసి రూ.16 వేలు ఆర్థిక సాయం అందించారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు సన్మానం

కొడంగల్, న్యూస్‌టుడే: మార్కెటు కమిటీ పాలక మండలిలో డైరెక్టర్‌గా ఎన్నికైన ఆసిఫ్‌ఖాన్‌ను మైనార్టీ సోదరులు సన్మానం చేశారు. సోమవారం కొడంగల్ వారు మాట్లాడుతూ. .మైనార్టీ సోదరులకు సీఎం రేవంత్‌రెడ్డి తగిన ప్రాధాన్యం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. మాజీ ఉప సర్పంచి గౌసన్ తదితరులున్నారు.

ఉన్న గుడి కూల్చారు.. కొత్తది నిర్మించేదెన్నడో?


పునాదికే పరిమితమైన ఆలయం

న్యూస్‌టుడే, దౌల్తాబాద్: మండల కేంద్రం దౌల్తాబాద్ పెద్దచెరువు కట్టపై పూర్వీకులు శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించారు. ఈ ప్రాంత భక్తుల కొంగు బంగారంగా కొలిచే స్వామి వారికి కర్ణాటక నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకునేవారు. నిత్యం భక్తులతో కిటకిటలాడే ఆలయం కాలక్రమేణ శిథిలావస్థకు చేరడంతో నూతన ఆలయం నిర్మించాలని గ్రామస్థులు నిర్ణయించారు. దేవదాయశాఖకు కొంతమేర నిధులు చెల్లిస్తే ఆలయ నిర్మాణానికి నిధులు కేటాయిస్తారని పాలకులు చెప్పడంతో గ్రామస్థులు విరాళాలు సేకరించారు. రూ.12లక్షలు దేవదాయశాఖకు చెల్లించారు. రెండేళ్ల క్రితం రూ.50లక్షలు మంజూరయ్యాయి. ఆలయాన్ని కూల్చి పనులు ప్రారంభించారు. దీంతో గ్రామస్థులతో పాటు భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా అధికారుల పర్యవేక్షణ లోపంతో పనులు జరగడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రెండేళ్లుగా పూజలకు నోచుకోక: ఆలయ పునః నిర్మాణం కోసం గుడి కూల్చేవేయగా, స్వామి వారిని ఆలయ ప్రాంగణంలోనే ఏర్పాటు చేసినా, పూజలకు నోచుకోవడం లేదని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏటా ఫిబ్రవరిలో స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. పనులు త్వరగా పూర్తి చేసేలా సీఎం చొరవ తీసుకోవాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

సీఎంను కలిసిన యువకులు: ఆలయాన్ని అభివృద్ధి చేసి ఈ ప్రాంతంలో పేదలకు వివాహాలు జరిపించేలా కల్యాణ మండపం నిర్మించాలని, గ్రామానికి చెందిన యువకులు కొడంగల్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విన్నవించారు. ఆయన సానుకూలత వ్యక్తం చేశారని వారు పేర్కొన్నారు.

గురుకులం విద్యార్థికి తైక్వాండోలో కాంస్య పతకం

మొయినాబాద్: స్వామినారాయణ గురుకులానికి చెందిన విద్యార్థి తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించాడు. ఉత్తరాఖండ్‌లో జరిగిన జాతీయస్థాయి ఛాంపియన్‌షిప్‌లో గురుకులంలో ఏడో తరగతి చదువుతున్న మణికంఠేశ్వరరెడ్డి అండర్-14 విభాగం, 23 కిలోల విభాగంలో పాల్గొని ప్రశంసాపత్రం అందుకున్నాడు.

కష్టపడి చదివితే సత్ఫలితాలు


ఉద్యోగాలు పొందిన వారితో మహేష్‌రెడ్డి

పరిగి, న్యూస్‌టుడే: మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన రాజేందర్, రాజేష్ ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక కావడంతో సోమవారం మాజీ ఎమ్మెల్యే కె.మహేష్‌రెడ్డి తమ నివాసంలో వారిని సన్మానించారు. కష్టపడి చదివితే ఫలితం దక్కుతుందన్నారు. యువత ముందునుంచే ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. నిత్య సాధనతో అనుకున్నది సాధించవచ్చని పేర్కొన్నారు. పుర ఛైర్మన్ అశోక్‌కుమార్, భారాస మండల నాయకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎస్.భాస్కర్, సురేందర్‌రెడ్డి తదితరులున్నారు.

వేపచెట్టు నుంచి కల్లు



దుద్యాల, న్యూస్‌టుడే: సామాన్యంగా ఈత, తాటిచెట్టుకు కల్లు రావడం సహజం, అందరికీ తెలిసిందే. భారీ వేపవృక్షానికి సైతం కల్లు వస్తోంది. దుద్యాల మండలం హస్నాబాద్‌లోని గాంధీ చౌరస్తా వద్ద వేప చెట్టుకు కొన్ని రోజులుగా వేప కల్లు ధారగా వస్తోంది. దీంతో గ్రామస్థులు పట్టుకోవడానికి చెట్టుకు డబ్బాలను ఏర్పాటు చేసుకున్నారు.

బుద్ధిబలంతో ఏదైనా సాధించవచ్చు: సబితా రెడ్డి

మొయినాబాద్: అంగవైకల్యం కేవలం శరీరానికి మాత్రమేనని, బుద్ధిబలంతో ఏదైనా సాధించవచ్చని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. మండల పరిధి నక్కలపల్లికి చెందిన కృష్ణకు మధుమేహం తీవ్రత కారణంగా వైద్యులు రెండు కాళ్లను తొలగించారు. సమస్య తెలుసుకున్న సబితారెడ్డి స్పందించి కృష్ణతో పాటు మరో దివ్యాంగురాలికి మూడు చక్రాల ఛార్జింగ్ సైకిల్‌ను సొంత ఖర్చుతో కొనుగోలు చేసి అందజేశారు.

అనుమానాస్పద స్థితిలో వలస కార్మికుడి మృతి

శంషాబాద్, న్యూస్‌టుడే: అనుమానాస్పద స్థితిలో ఓ వలస కార్మికుడు మృతి చెందిన ఘటన శంషాబాద్ మండలంలో సోమవారం చోటుచేసుకుంది. శంషాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా కొందుర్గు మండలం రామచంద్రాపురానికి చెందిన సురేష్(26), శిరీష దంపతులు రోజువారీ కూలీలు. ఉపాధి కోసం ఇటీవల శంకరాపురానికి వచ్చి ఓ వ్యవసాయ క్షేత్రంలో పనిచేస్తున్నారు. వ్యవసాయ క్షేత్రంలోని ఓ బావిలో సురేష్ విగతజీవిగా కనిపించాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మనోవేదనతో వృద్ధుడి బలవన్మరణం

చేవెళ్ల గ్రామీణం, న్యూస్‌టుడే: భార్య మృతి చెందడంతో ఒంటరి జీవితం గడుపుతున్న భర్త మనోవేదన చెంది బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగుజూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. చేవెళ్లకు చెందిన మల్గారి మోహన్‌రెడ్డి(61) భార్య మల్లమ్మ గతేడాది గుండెపోటుతో మృతి చెందింది. అప్పటినుంచి ఒంటరిగా ఉండడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి ఇంట్లో అందరూ భోజనం చేశాక గదిలోకి వెళ్లి పడుకున్నాడు. సోమవారం ఉదయం గదినుంచి బయటకు రాకపోవడంతో కుమారుడు వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. కుమారుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పచ్చదనం పరుచుకున్న రహదారులు

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులు పచ్చని చెట్లతో మనోహరంగా కళకళలాడుతున్నాయి. పంచాయతీరాజ్, జడ్పీ, ఆర్అండ్‌బీ రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలు ఏపుగా పెరిగి రహదారులకు పచ్చందాలు తెచ్చిపెట్టాయి. ప్రభుత్వాలు చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా పచ్చదనం పెంచడానికి చేపట్టిన చర్యలు ప్రస్తుతం సత్ఫలితాలు ఇస్తున్నాయి. రహదారులకు ఇరువైపులా వేల సంఖ్యలో మొక్కలు నాటి నీళ్లుపోసి సంరక్షించారు. ఈ బాధ్యతలను పంచాయతీ కార్యదర్శులకు అప్పగించడంతో వారు వంతు చెట్లను కాపాడటానికి కృషి చేశారు. ఫలితంగా రోడ్లకు ఇరువైపులా పెరిగిన చెట్లు ప్రయాణీకులకు ఆహ్లాదాన్ని పంచడంతో పాటు వాతావరణ సమతుల్యానికి దోహదం చేస్తున్నాయి.


బొంరాస్‌పేటలో రోడ్డుకు ఇరువైపులా..

మూడేళ్లలో 1.17లక్షల మొక్కలు

బొంరాస్‌పేట మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులను గుర్తించి వాటికి ఇరువైపులా గత మూడేళ్లలో 1.17లక్షల మొక్కలు నాటారు. వీటి కోసం జాతీయ గ్రామీణ ఉపాధి పథకం నిధులు రూ.42 లక్షలను ఖర్చు చేశారు. 2022-23 సంవత్సరంలో 67 కి.మీలో 58వేల మొక్కలు నాటి రూ.21లక్షలు వ్యయం చేశారు. 2023-24లో 51 కి.మీ దూరంలో 38వేల మొక్కలు నాటి రూ.14లక్షలు ఖర్చు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 36 కి.మీ దూరంలో 21వేల మొక్కలు నాటి రూ.7లక్షలు ఖర్చు చేశారు. నాటిన మొక్కల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. వాటి చుట్టూ కంచె ఏర్పాటు చేసి ఎండాకాలంలో ఎండిపోకుండా నిత్యం నీళ్లు పోశారు. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటారు. ప్రతి గ్రామానికి ట్రాక్టరు, నీళ్ల ట్యాంకర్ ప్రభుత్వం మంజూరు చేయడంతో మొక్కల సంరక్షణ సాధ్యమైంది.

మొక్కల సంరక్షణకు ప్రాధాన్యం:

– మల్లికార్జున్ యాదవ్, ఏపీవో

బొంరాస్‌పేట మండలంలోని రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇచ్చాం. ఎండిపోకుండా ఎప్పటికప్పుడు నీళ్లు పోయించాం. మూడేళ్లలో మొత్తం 1.17 మొక్కలు నాటాం. రోడ్లపై వెళ్లే వాహనదారులు, ప్రయాణికులకు చెట్లు ఎండ నుంచి ఉపశమనం, ఆహ్లాదాన్ని పంచుతుంది.

మురుగు కాల్వలు నిర్మించరూ!



మండల పరిధి నాగసమందర్ గ్రామంలో అంతర్గత మురుగు కాల్వలు లేకపోవడంతో ఇళ్లలోని వృథా నీరు రోడ్లపై పారుతోంది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తడమే కాకుండా పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. అంతర్గత మురుగు కాల్వలు నిర్మించాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు దృష్టిసారించి కాల్వలు నిర్మించి ఇబ్బందులు తొలగించాలని వారు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, ధారూర్

ఎంపీని కలిసిన భాజపా నాయకులు

చేవెళ్ల, న్యూస్‌టుడే: చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భాజపా యువనాయకుడు డా.వైభవ్ రెడ్డి, నాయకులు మాణిక్య రెడ్డి, శ్రీశైలంయాదవ్, శ్రీనివాస్, రామకృష్ణ తదితరులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి దసరా శుభాకాంక్షలు తెలిపారు.